



# క్షతగాత్ర గానం


అట్టాడ అప్పల్నాయుడు


వంశధార నది- సన్నగా యేడుస్తోన్న గ్రామదేవతలా వుంది. నెమ్మదిగా ప్రవహించే నది వేగం అకస్మాత్తుగా పెరిగింది. నీరు జేగురురంగులోకి మారి వరదలా కెరటాలు వేస్తోంది.

వరదప్రవాహంలో మృతదేహాలు వందలు, వేలు కొట్టుకు వస్తున్నాయి. కొన్ని దేహాలు నది ఒడ్డుకి మేటగా ఉన్న యిసుకపర్ర మీదకు చేరాయి. కెరటాలు- యిసుక మేటను ఢీకొట్టి నదీ ప్రవాహంలోకి యిసుకను యీడ్చుకు పోతున్నాయి. మృతదేహాలు... కోటేరేసిన నాగళ్లలా వున్నాయి. తలపాగా, నాగుల గావంచా చిల కట్టూ తప్ప... ఆ దేహాల మీద మరేమీ అలంకారాలు లేవు. అన్నీ... పరిచితుల దేహాలన్పిస్తున్నాయి. తన పల్లె లోని, తన ముత్తాతల, తాతల వారివారి బంధుమిత్రుల బృందాల... దేహాలా...? దగ్గరగా వెళ్లి పట్టిచూస్తే యే దేహానికీ కళ్లూ, నోరూ, ముక్కూ లేవు! మొత్తం దేహం... నాగలిలా కన్పిస్తోంది.

కోటేశ్వర్రావుకి చెమటలు పట్టేశాయి. నాలుక దాహంతో పిడుచ గట్టుకుపోయింది. దోసిలిపట్టి తాగుదామంటే నీరు యెర్రగా రక్తంలా కన్పించింది. భయాందోళనల్తో... గభాల్న లేచి పారిపోబోయేడు.

బెర్తు మీంచి ఒక్క ఉదుటున లేవడంతో తల రైలుపెట్టె బెర్తు పై భాగానికి తగిలి నొప్పిపెట్టింది. 'అబ్బా' అనుకుని నుదుటి మీద చెయ్యి వేస్తే చల్లగా తగిలింది. భయంతో... చేతి కంటిన తడిని చూసేడు... రక్తమా? కలా, నిజమా? తలకు తగిలిన బొప్పి వాస్త వమే! మెల్లగా, కిటికీ దగ్గరకు చెయ్యి జాపి, లైట్ స్విచ్ ఆన్ చేశాడు. ధగధగా వెలుగు నింపాల్సిన బల్బు వేట గాని టార్చిలా వెలిగింది. మృతదేహాల్ని మోసుకుపోతోన్న పెనుశకటంలా సోయిలేని ప్రయాణీకుల్ని మోసుకు పోతోంది రైలు. వెల్తురులో, మెలకువలో మరింత భయం వేసింది. చేతికి అంటిన తడి చూసేడు- రక్తం కాదు, చెమట! మంచినీళ్ల బాటిల్ తీసి, గొంతులో వొంపుకోబోతూ- భయంగా బాటిల్‌ని చూసేడు. ఏదో విదేశీ కంపెనీవారి మినరల్ వాటర్! గుక్కెడు, గుక్కెడు గా... గుటకలు మింగేడు.

ఎదుటి బెర్తు మీంచి యెవరో-

"యే స్టేషనండీ...?" ప్రశ్నించేరు.

"...కళింగతీరం..." జవాబిచ్చేడు కోటేశ్వర్రావు.

ఆ స్టేషనెక్కడుందా అని ఆశ్చర్యపోతూ, "బెర్హం పూర్ వొస్తే లేపండీ..." దుప్పటి మొహమ్మీదకు లాక్కుంటూ రిక్వెస్ట్ చేశాడు, యెదుటి బెర్త్ వ్యక్తి.

"...లేపను. నేను లేపనయ్యా నాకవసరం లేదు. నేనేమీ పరోపకారి పాపన్నను కాను. పూర్వకాలం కాదిది నేను లేపనయ్యా. నీకవసరమైతే నువ్వు మేలుకుని వుండు. నేను మేలుకుని వున్నా సరే, నిన్ను లేపను," నిష్కర్షగా చెప్పాడు.

ఎదుటి బెర్తు వ్యక్తికి నిద్రమత్తు వొదిలిపోయి, కప్పుకున్న ముసుగుతీసి, కోటేశ్వర్రావు వైపు ఆశ్చర్యంగా చూడసాగేడు.

కోటేశ్వర్రావు అదేమీ గమనించడం లేదు. ఎక్కడో వున్నాడు... ఎంత నిష్కర్షగా చెప్పాడు! ఎంత తేలిగ్గా... ఈనాటి యువతలా కఠినంగా! కొడుకే, కన్న కొడుకే...! నిజానికి వాడి కోణంలో ఆలోచిస్తే... వాడిదీ రైటేనేమో?

"... ప్రవీణ్, అక్క వెళిపోవాలిరా..." విజయదుర్గ కొడుకు మొహంలోకి చూస్తూ పలికింది.

కొడుకు- తల్లివైపు చూడకుండా, సోఫాలో కూర్చొని, టీవీ రిమోట్ అందుకొని, టీవీ ఆన్ చేశాడు. నల్లటి తెరను చీల్చి రంగురంగుల దృశ్యాలేవో శబ్ద మారంభించేయి.

"...రేపూ యెల్లుండిలోగా బావ గూడా వస్తా రట..." విజయదుర్గ.

"అవకాశం లేదమ్మా. హారిక ఫారన్ ఛాన్స్ కోస మంటోంది..." ఛానెల్ మార్చాడు కొడుకు.

విజయదుర్గకు గుండెల్లో రాయిపడింది. కొడుకు సహకరిస్తాడని ఆశ పెట్టుకుంది. ఇంటికి పెద్ద కొడుకు, స్తోమతగల కొడుకు గనక యీ బాధ్యత అంగీకరిస్తా డనుకొంది.

"...అదిగాదు బాబూ, అప్పుగా యిమ్మంటు న్నారు. ఒక యేడాది ఆగితే, యేదో జేసి తీర్చేస్తామంటు న్నారు..."

"...యిపుడలాగే అంటారు. తీరా, అందుకున్నాక తీర్చలేమంటే... కోర్టుకెక్కగలమా?" టీవీ చూస్తూ బదు లిచ్చేడు.

తల్లీ, కొడుకుల సంభాషణలా లేదా దృశ్యం- యెవరో పరాయి వ్యక్తులు వ్యవహారమేదో మాట్లాడు తున్నట్లుగా వుంది!

"పోనీ, అంతగా అయితే, మీ నాన్నగారు తీరు స్తారు..." హామీ యిచ్చింది విజయదుర్గ.

"అమ్మా! నీ భర్తా, అల్లుడూ హరిశ్చంద్రులు కారు. నేను నక్షత్రకుణ్ణి గాలేను. హారికకి, నాకూ గూడా మా కంపెనీ ఫారిన్ బ్రాంచిలో ఛాన్స్ రావచ్చు. దాని కోసం ట్రయల్స్‌లో వున్నాం. పొలిటికల్ హేండ్సేవేనా హెల్ప్ చేస్తే అయిపోతుంది. నాన్నగారి ఫ్రెండు న్నారుగా... ఆ ఊర్లో...? నాన్నగారు ట్రై చేస్తే..." చెప్పుకు పోతున్నాడు కొడుకు.

అంతకుమునుపే యెపుడో వచ్చి నిస్త్రాణగా బెడ్ మీద వాలిపోయిన కోటేశ్వర్రావుకి- యీ దృశ్యమయితే కన్పించటంలేదుగానీ, సంభాషణంతా విన్పిస్తోంది. అక్కా తమ్ముళ్ల అవసరాలూ, సర్దుబాట్లూ లావాదేవీల గానే గణిస్తున్నాడా కొడుకు- కోటేశ్వర్రావు మనసులో ప్రశ్న!

"...నీ స్వార్థమేగానీ, అక్క పరిస్థితి ఆలోచించవే? ఇంటి పెద్దకొడుకుగా నీకు బాధ్యత లేదా?" వాదనకు దిగింది విజయదుర్గ.

టెలివిజన్‌లో గుంపు గుంపుల యువతీ యువకులు అర్ధనగ్నంగా ఆడుతూ, పాడుతూ యేవో డ్రింకులు తాగుతూ- వాళ్ల తప్ప లోకంలో మరెవ్వరూ లేరన్న భావంతో తడితడి పెదవుల్తో పరస్పరాలింగనా లతో చుంబించుకుంటున్నారు.

"... అమ్మా! నన్నర్థం చేసుకోవేమి?"

"... అల్లుడేనాడూ, మనల్ని యిబ్బంది పెట్టలేదు. కంపెనీ మూతపడిగానీ- లేకపోతే, యీ వ్యాపారంలోకి దిగకపోయుణ్ణు..." విజయదుర్గ గొంతులో అభ్యర్థన ధ్వని.

అల్లుడు పనిచేసే కంపెనీ- గవర్నమెంట్ అండర్ టేకింగ్‌లో వుండేది. నష్టాల కారణంగా... కంపెనీ మూత పడింది, ఉద్యోగులకేదో ముట్టజెప్పి!

మల్టీనేషనల్ కంపెనీ యేదో టేకోవర్ కోసం చూస్తోందట కానీ- వ్యవహారం సెటిల్ కాలేదు. యూని యన్లూ, ప్రతిపక్ష రాజకీయ పార్టీలు, ప్రభుత్వాధికార్లూ, అధికార పార్టీవారూ... వ్యక్తిగత లాభాపేక్షతో కట్టుబడి వ్యవహారాన్ని తేల్చడంలేదట!

అల్లుడు తనకందిన రిట్రెంచ్‌మెంట్ ఎమౌంట్‌ని, పెళ్లినాడిచ్చిన కట్నం సొమ్మునీ కలిపి 'హోం నీడ్స్' ట్రేడింగ్ బిజినెస్ పెట్టేడు.

హోంనీడ్స్... గృహావసరాలు...! వీటికోసం కంపెనీలు, ఏజెన్సీలు...!

నీళ్లూ, పాలూ, ఉప్పుపప్పులూ, కర్రా, కంపా, చాపా, బొంతా, చీపురూ, ముగ్గుపిండీ, నలుగుపిండీ, గానుగనూనె... గృహావసరాల కోసం- యే పరుగు పందెమూ అవసరంలేని రోజులు గుర్తొచ్చాయి విజయ దుర్గకు. పీటచెక్క నుంచి కంచాలు, మంచాలు అన్నిటినీ ఊరిలోని రకరకాల వృత్తుల వాళ్ల తయారు చేసినవే- తను సారెగా తీసుకువచ్చింది కాపురానికి!

హోంనీడ్స్ అన్నింటినీ తేలేనందుకూ, తెచ్చినవీ స్టాండర్డ్ కంపెనీలవి గానందుకూ- గ్యాస్‌పొయ్యి మంటల్లో కాలిపోయిన తన కాలనీ చివరి ప్లాట్ కోడలు సడన్‌గా విజయదుర్గకు గుర్తొచ్చింది.

'హోంనీడ్స్' బిజినెస్ వొద్దని చెప్పింది అల్లుడితో. అల్లుడు వింతగా నవ్వేసి, విజయదుర్గ చేతనే షాపు ఓపెన్ చేయించాడు. ఇపుడేదో కంపెనీ, వాషింగ్ మెషిన్ ఏజెన్సీకి యెక్కువ కమీషన్ ఆఫర్ చేస్తోందట! దాని కోసం డబ్బు కావాలి అల్లుడికి!

మూడేళ్ల కిందటే కూతురి పెళ్లి చేశారు. ఆ అప్పు భారం... కొంతగా గత యేడాదంతా పంచుకున్నాడు ప్రవీణ్, కాబట్టే నిరుడు చిన్నకొడుక్కి డొనేషన్ చెల్లించి

ఇంజనీరింగ్‌లో జాయిన్ చేశారు. కోటేశ్వర్రావుకి... కట కటగా ఉంది ఆర్థిక పరిస్థితి. ఈ యేడాది తొలినాళ్లలో హారికతో డేటింగ్ జరిగాక ప్రవీణ్ యేమీ యివ్వటం లేదు. పెళ్లి, ఫారిన్ జాబ్... అన్ని ప్లాన్డ్‌గా జరిగేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నాడు తప్పా...!

"... అయితే అక్క సంగతి నీకక్కర్లేదా?" ఆఖరి మాటగా ప్రశ్నించింది దుర్గ.

"... నేను బెస్ట్ పొజిషన్‌లో నిలబడాలి. తరువాతే, అక్కా, బావా, తమ్ముడూ అన్ని బంధాలూ! వెయిట్ చెయ్యండి... టూ యియర్స్ ఆగితే- ఫారిన్‌లో షాపు కావాలన్నా పెట్టిస్తాను..." టీవీ వైపు చూస్తూ భుజా లెగరేస్తూ చెప్పేడు.

టీవీలో- యెత్తుపల్లాల రహదారీ, దూకే పులీ, దాన్ని మించిన వేగంతో పరుగెత్తే మోటార్ సైకిల్ పై విజయగర్వంతో ఓ యువకుని ఫోజు. అతణ్ణి ఆరాధన గా పెనవేసుకుపోయే యువతీ... దృశ్యం కన్పిస్తోంది విజయదుర్గకు- అదేమి ప్రకటనో అర్థంగాలేదు. పులిలా దూసుకుపోవాలంటే అదేదో మోటార్ సైకిలుండాలనా? అలాగైతే, అందాల యువతి లభిస్తుందనా...?

ఈ ప్రకటనలు- సరుకుల్ని అమ్ముతున్నాయా... జీవిత విధానాలను అమ్ముతున్నాయా...? ప్రశ్నించు కున్న దుర్గ- గభాల్న లేచి టీవీ స్విచ్ ఆపేసింది. రంగుల భూతమేదో తకాలున చీకట్లో మాయమైనట్లు టీవీ తెర నల్లగా మారింది.

కోటేశ్వర్రావు... చాలాసేపు... అలా... యింట్లో జరిగిందంతా... మరోసారి గుర్తుకు రాగా... ఆలోచనల్లో మునిగిపోయేడు....

ఎదుటి బెర్తు మీది వ్యక్తి కప్పుకున్న దుప్పటి లోంచే-

"లైట్ ఆఫ్ కరో భాయ్. సోనేవాలోంకో సోనేదో..." కేకేశాడు.

కోటేశ్వర్రావు యెదుటి బెర్తు వైపు చూసేడు. దుప్పట్లోంచి ఆ వ్యక్తి కేక ముసుగు గప్పిన మృతదేహ మేదో జీవించి వుండగా పలకటం మర్చిపోయిన మాటను మృతి చెందాక పలికినట్లుగా విన్పించింది. మళ్లీ కోటేశ్వర్రావుకి కల గుర్తుకువస్తోంది. వందలు, వేల మృతదేహాలు... యుద్ధమేదో... తెలీటంలేదు! కన్పించని యుద్ధ గాయాలను మోసుకు... కాందిశీకుణ్ణయి నానా...? తనని తాను ప్రశ్నించుకున్నాడు కోటేశ్వర్రావు. విధ్వంసం గుర్తున్నంతగా- విధ్వంసం ముందరి జీవితం గుర్తు లేదతనికి!

మళ్లీ, యెదుటి బెర్త్ మీంచి ముసుగు కప్పిన వ్యక్తి- ధ్వని హెచ్చించి కేక వేశాడు! కోటేశ్వర్రావుకి బెర్త్ వైపు చూస్తుంటే, 'వాస్తవం వెనుక అధివాస్తవంలో మనిషి ముఖమ్మీద స్వప్నలిపి చూస్తున్నాను...' అజంతా కవిత్వం గుర్తొచ్చింది. లైట్ ఆఫ్ చేసి, బెర్త్ మీద వాలి, కళ్లు మూసేడు.

*

దీర్ఘమైన యెడబాటు తర్వాత కలిసిన బాల్య మిత్రుణ్ణి చూసేట్లు ఆ రైల్వే‌స్టేషన్‌ని చూడసాగేడు కోటేశ్వర్రావు. తన గ్రామం నుంచి- విశాల ప్రపంచానికి దోవ తెరిచిన వాకిలి ఆ స్టేషన్. రైలు దిగి, పరిసరాల్ని కళ్లారా చూడసాగేడు. వెయిటింగ్ రూములో కట్టెల మోపులూ, కట్టెల్లాంటి మనుషులూ, ఎడమ చేత్తో విసన కర్ర ఊపుతూ, కుడిచేత పళ్లెంలో బెల్లపుండలూ, జాంగ్రీలూ, జంతికలూ, సెనగలూ, ఈగలూ, దోమలూ మోస్తోన్న బద్రంశెట్టీ; హాలు మధ్యలో- దేవేంద్ర లోకం లో దివ్యభోగాల్లో మునిగి తేలుతున్నట్లు- జంబుఖానా పరచి, కాషాయగుడ్డ సంచీ తలదిండుజేసి నిద్రించే స్వాములూరూ; ద్వారం ముందర- రాని రైలుకోసం యెదురుజూసే ప్రయాణీకులూ... యెవ్వరూ పరిచి తులు కారు! అసలు వీళ్లంతా యెప్పటివాళ్లు...? కళింగ యుద్ధంనాటి కాందిశీకులా...? మళ్లీ అందర్నీ పరికిం చేడు. రాత్రి కలలో- నదిలో కొట్టుకు వచ్చిన మృత జాన పదులను జీవించగా చూస్తున్నట్లన్పించింది.

కోటేశ్వర్రావు- స్టేషన్ మాస్టారి రూము యెదురు గా వచ్చి చూసేడు. చెవులకు ఫోన్ రిసీవర్ తగిలించి, చేతుల్తో కేబుల్ లైన్స్ ఆపరేట్ చేస్తూ... యంత్రాల మాంత్రికుడిలా కన్పించేరు మాష్టారు. చూపు... రైలు పట్టాల మీదకు మరల్చాడు. సాయంత్రపు ఎండానీడా పడి ధగధగా మెరుస్తూ... నల్లగా, వొకదానితో మరొకటి పోటీపడి పరుగెత్తే నల్లత్రాచుల్లా కన్పించేయి పట్టాలు! మరి చూడలేకపోయాడు. స్టేషన్ బయటికి వచ్చేడు.

"...చాన్నాళ్లకి సార్, బాగున్నారా?" ఆటోతో నిల్చొని, పలుకరించేడో వ్యక్తి. కోటేశ్వర్రావు అతణ్ణి చూసి,

"... సోములూ నువ్వా? కుర్రాడిలా... ఫేంటూ షర్టేంటి? ఆటో యేంటి...?" ఆశ్చర్యంగా, ప్రశ్నించేడు. ఆ వ్యక్తి చిన్నగా నవ్వి, కోటేశ్వర్రావు చేతిలో లగేజి అందుకొని-

"సోములు మనవణ్ని సార్..." అన్నాడు.

కోటేశ్వర్రావు తన కంటి అద్దాలు సరిచేసు కున్నాడు. కంటికే గాదు... మనసుకే- అన్నీ. అందరూ... గత కాలంలో నిలుస్తున్నారు.

ఆటో స్టార్టయ్యింది. మరెవ్వరూ పాసింజర్లు లేరు... తనొక్కడే! రోడ్డు పురాతన మిత్రునిలా ఊరివైపు తీసుకుపోతోంది. రోడ్డు పొడవునా చెట్లు- కళింగ యుద్ధ ఖైదీల్లా... దిగులుగా నిల్చున్నాయి.

"నీ పేరేమిటోయి...?"

"...ఉత్తమ్ అని పిలుస్తారు... పురుషోత్తం..."

అలెగ్జాండర్తో పోరాడి ఓడిన పురుషోత్తముడా...!?

కోటేశ్వర్రావుని రాత్రి వచ్చిన కల వెంబడిస్తోంది. వర్తమానంలోకి వచ్చేందుకు- కళ్లు మూసి, మనసు ప్రశాంతపరచ ప్రయత్నించేడు. జీవించటానికి, మరణించటానికి తేడా ఘర్షణ! ఆగితే మరణం...! శరీరంలో ఘర్షణ, కుటుంబంలో ఘర్షణ, కుటుంబాల మధ్యా...

"బావా..." అన్న పిలుపు విన్పించింది.

వేసవి సాయంకాలం! వంశధార నది- చిరకాల సహచరిలా- చూస్తూ కూర్చున్న కోటేశ్వర్రావు ఆశ్చర్య పోయేడు. ఎదురుగా సుభద్ర... చిలుక పచ్చరంగు లంగా, జాకెట్ మీదుగా తెల్లటి నైలాన్ వోణీ. సుభద్ర అందంగా కన్పించింది. చూస్తూ వుండిపోయేడు.

సుభద్రగారి తాతయ్య, కోటేశ్వర్రావు తాతయ్యా స్వయానా అన్నదమ్ములు. కోటేశ్వర్రావుగారి తాతయ్యకు ఇద్దరు కొడుకులు, ఒక కూతురు సంతానం. ఆ కూతురు కొడుకే కోటేశ్వర్రావు. సుభద్ర వాళ్ల తాతయ్యకు ఒకడే కొడుకు. ఆ కొడుక్కి ఒక్క కూతురే మిగిలిన సంతానం- ఆమే సుభద్ర.

తాతయ్యలిద్దరూ కలిసి వుండేవారు. కష్టపడి బతికేవారు. జమీందార్ల కాలంలో భూమి సమస్యల్తో సుభద్ర వాళ్ల తాతయ్య- భార్యాబిడ్డల్ని అన్నకు అప్ప జెప్పి రంగం వెళిపోయేడు. అక్కడి నుంచి, అపుడపు డొచ్చేవాడు. సంపాదన పంపేవాడు. ఓ యేడాది ఆయన రాలేదు. విదేశీ స్మశానంలో బూడిదయిపోయేడు. ఆ తర్వాత కొద్దినాళ్లకే యే పొరపొచ్చాలొచ్చాయో తాత గారిల్లు భాగాలయ్యింది. ఆస్తిపంపకాలు అనుబంధాల్ని తెంపేయి. తాతగారిల్లు- పెద్దిల్లు, చిన్నిల్లూ అయ్యింది. చిన్నింటోళ్ల సుభద్రంటారు... ఊరివాళ్లు సుభద్రను.

"...ఈమధ్య పెదనాన్నకు పెద్ద గండం తప్పింది తెల్సా?" అనడిగింది సుభద్ర. కోటేశ్వర్రావుకేమీ అర్థం కాలేదు. ఎలక్ట్రికల్ డిప్లొమా కోర్సులో జాయినయ్యాక కలకత్తా నుంచి యేడాదిగా ఊరికి రాలేదు. ఇదే వేసవి సెలవులకు రావడం...! వచ్చినరోజునించీ సందడి సందడిగా వుండే తాతగారిల్లు ఇన్విజిలేటర్ల నిఘాలో పరీక్ష హాలుగా వుండటాన్ని గమనించినా, కారణాలు వెదుక లేదు.

"ఊరు ఊరంతా ఒక్కకట్టు మీదుండేది. ఇపుడు ముక్కలయ్యింది. పొరుగూరు పెద్దలేమో- వొచ్చేసారి సర్పంచ్‌వి నువ్వే అవ్వాలని మా నాన్నని ప్రలోభపెట్టేరు. మా నాన్నా పెదనాన్నల మధ్య... పులీ పంది పోరులా వుంది. ఈ యింటి మీద కాకి, ఆ యింటిమీద యెగర కూడదు. ఎప్పుడేమవుతారో భయంగా వుంది..."

కోటేశ్వర్రావు దీర్ఘంగా నదిని చూస్తూ, "భయ మెందుకూ...?" అని ప్రశ్నించేడు.

"...యెందుకేంటి? గొడవలొస్తే మధ్యలో తల దూర్చేవారెవరూ? మా నాన్న యిటూ పెదనాన్న అటూ! వారం కిందట యేం జరిగిందీ? స్కూలు బిల్డింగ్ కోసం ఊరి ముందరి మెరక భూమి పంచాయితీదని స్వాధీనం చేయించబోయేడు పెదనాన్న. కాదు, మా జిరాయితీ భూమంటాడు మా నాన్న. పట్టా కాగితాలు చూస్తే తేలి పోదా? కర్రలూ, కత్తులూ తీసేరు. పెదనాన్న తల పగిలి పోయేదట- మీ కంబారి సోములుగాని అడ్డంబడి రక్షించకపోతే?" చెప్పింది సుభద్ర.

కోటేశ్వర్రావుకి ఆందోళనగా గుండెలు కొట్టు కున్నాయి. తాతగారింటి నిశ్శబ్ద వాతావరణానికి కారణం తెల్సింది. అప్పుడు సోములు గుర్తొచ్చేడు.

"ఆస్పత్రిలో వున్నాడు. పర్లేదట, రేపు డిశ్చార్జట..."

సోములు తాతగారింట పాలేరుగాడు, కుటుంబ సభ్యుడిలా మెదిలేడు... అసలీ ఘర్షణలకు... మూల మేది? పంచాయితీ రాజకీయాలేనా...? పైకి అవి కారణాలుగా కన్పిస్తున్నాయిగానీ కన్పించనివేవో వున్నాయి! వాటితో ఘర్షించబోయి- తమలో తాము ఘర్షించు కుంటున్నారా...?

రాజుల, జమీందార్ల, తెల్లదొరల... యేలుబడి పోయేక, పాలించబడేవాళ్లు కొందరు పాలకులయి నారు. పాలకవర్గంలో కొత్త గుంపు చేరింది. పాతా, కొత్తా గుంపుల మధ్యనా ఘర్షణ వుండొచ్చు. పాలక గుంపుకీ, పాలితులకీ మధ్యనా ఘర్షణ వుండొచ్చు. ఎలక్ట్రానిక్స్ లెక్చరర్, అపుడపుడూ, పాలిటిక్స్ గురించి చేసిన విశ్లేషణ గుర్తొచ్చింది కోటేశ్వర్రావుకి.

కళ్లు మూసుకొని వర్తమానంలోకివచ్చే ప్రయత్నం చేస్తుంటే- గతమే కదుల్తోంది కోటేశ్వర్రావు మదిలో!

"...సార్, తాతగారికి బాగోలేదని తెల్సి వచ్చేరా?" చాలాసేపట్నించీ మౌనంగా వున్న కోటేశ్వర్రావుని ప్రశ్నించేడు పురుషోత్తం.

"తాతయ్యకు బాగులేదా?" ఆశ్చర్యంగా, గుండె లోపలి ప్రశ్న... బయటికే విన్పించింది.

"...ఔనట సార్. మా తాత చెప్పేడు. తీవ్ర జ్వర మట. పరాకు, పరాకు మాటలట. నిద్రపోరట. ఏ అప రాత్రో... పొలానికి వెళిపోతారట. తెల్లవారేక, యింటిల్లి పాదీ వెదుకులాటట..."

పురుషోత్తం చెప్తూ, ఆటో నడుపుతున్నాడు. ఎదురుగా ట్రక్కర్... నిండుగా ప్రయాణీకుల్తో వొస్తోంది. రోడ్డు యిరుకుగావటంతో, స్లోజేసి సైడుకి తీసి-

"చూసేరుగదా! ఈ ట్రక్కర్లొచ్చి- మా ఆటోలకి బేరాలు పోయేయి. అంతకుమునుపు, మా ఆటోలొచ్చి రిక్షాలకి బేరాలు పోయేయి. మీ తాతగారి కాడ కంబా రికం మానేసాక మా తాత రిక్షా వేసేవాడు..." ఆటో మళ్లీ రోడ్డు మీదకి యెక్కించి, గేరు మార్చేడు. స్పీడు అందు కున్నాక,

"... జీపులూ, కార్లూ, ట్రక్కర్లూ... కొత్తకొత్తవెలాగ ఊరొచ్చేయో- అలాగే కొత్తకొత్త మనుషులూ, అల వాట్లూ ఊరిలోకొచ్చేయి! అన్నట్టు సార్, మీరు రిటైర యితే ఊరొచ్చేస్తారట గదా...?" అని ప్రశ్నించేడు.

కోటేశ్వర్రావుకి గుండెల్లో ముల్లులా గుచ్చిందా ప్రశ్న.

"...వొచ్చేయండి సార్. పుట్టిన మట్టిలో బుగ్గి గావాలంటారు పెద్దలు," ఆహ్వానించేడు పురుషోత్తమ్.

పుట్టిన మట్టిలో బతకటానికి గాదు- బుగ్గి గావ టానికి తనకిక అవకాశం లేదు. అవకాశాన్ని శాశ్వతంగా చెరిపేందుకు సిద్ధపడిపోయానా...? సిద్ధంజేశారా...

"...అమ్మా! సెంటిమెంట్స్ వొదిలెయ్యాలమ్మా. ప్రపంచవేగాన్ని అందుకోవాలి. లేకపోతే వెనకబడి పోతాం. అనుబంధాలు గావమ్మా! ఆపర్ట్యూనిటీస్ వెదకాలి..." తల్లికి హితబోధ చేస్తున్నాడు కొడుకు.

బెడ్‌రూము నుంచి చెవొగ్గి వింటున్న కోటేశ్వ ర్రావుకి యెక్కడలేని నీరసమూ ఆవహించింది.

"ఆ ఊరిలో భూముంది గదా? మనమేమీ పంటని తెస్తున్నామా? పోనీ, దానికోసం ఆ ఊరు వెళ్లి బతగ్గలమా? ఇపుడక్కడ భూములకి మంచి ధర పలుకుతోందట! అమ్మేస్తే... అక్క ప్రాబ్లెమూ సాల్వవు తుంది. యింకా మిగిల్తే, మనకీ అప్పులున్నాయిగా? సెంటిమెంటు కోసం భూమెందుకు..." తన కొడుకు పుట్టిన మట్టి నుంచి తనను వేళ్లు తెంపుకోమంటున్నాడు.

ఆలోచనల్లోంచి తేరుకొని దీర్ఘంగా నిట్టూర్చి, "నీకు పెళ్లయ్యిందా ఉత్తమ్...?" ప్రశ్నించేడు కోటేశ్వ ర్రావు. సడెన్‌గా ఆ ప్రశ్న యెందుకు వేశారా అన్న ఆశ్చ ర్యంతో వెనక్కి మొహం తిప్పి,

"లేదు సార్! ఎందుకూ...?" అనడిగేడు ఉత్తమ్.

కోటేశ్వర్రావు అతని మొహంలోకి చూస్తూ మరేదో అడుగబోయి, "మీ తాతయ్య సోములేమంటాడు ఉత్తమ్..." అనడిగేడు.

"మీ రిటైర్మెంటింకెన్నాళ్లుంది సార్...?"

సోములు ప్రశ్నలా విన్పించింది. కోటేశ్వర్రావు మళ్లీ ఆలోచనల్లో మునిగిపోతూ,

"యింకెన్నాళ్లు? వచ్చేనుగా! ఇవ్వాళో, రేపో అయి పోవచ్చు..." బదులిచ్చేడు.

పురుషోత్తమ్‌కి బోధపడలేదు. కోటేశ్వర్రావు... యివ్వేళో, రేపో... పుట్టిన మట్టి నుండి వేళ్లు తెంచుకో బోతున్న వేదనలో వున్నాడు. వేళ్లున్నాయా...? ఆనాడే తెంచేసావేమో... ప్రశ్నించింది మనసు. ఎన్నడో... చిన్న నాడే... చదువుకోసం ఊరొదిలేసినపుడే వేళ్లు తెగినాయా.

ఊరికి రెండు మైళ్ల దూరంలోని, హైస్కూల్ చదువయ్యేక కాలేజీ చదువు సమస్య అయ్యింది. కోటేశ్వర్రావు చినమామ కలకత్తాలో రైల్వే ఉద్యోగి. అతని పిల్లల్తో పాటు చదివిస్తాను వొచ్చెయ్యమన్నా డాయన.

అప్పటికి తాతగారింటి ఆర్థిక పరిస్థితీ దిగజా రింది. పెదమామ రాజకీయ ఘర్షణలకీ, కేసులకీ, కోర్టు లకీ యింట్లోని వెండీ, బంగారాలు చెల్లిపోయేయి. వ్యవసాయంలో... వ్యాపార పంటలొచ్చేయి. షుగరూ, జూట్‌మిల్లులొచ్చేయి. ఆ పంటలు- ధరల యెగుడూ దిగుళ్లకి అప్పుల్తో మిగిలేరు. ఇవన్నీ గ్రహించి పెదమామ తనని తీసుకువెళ్తానన్నాడేమో...!

కానీ, తాతయ్య మనస్ఫూర్తిగా అంగీకరించినట్లు లేదు. ఆరోజు తాతయ్య ఇంటి ముందరి కళ్లాంలో నులకమంచమ్మీద కూర్చొని, మడిచెక్కలకు గత్తం వెయ్యాలి. సారం తగ్గిందనీ, తోటలో చెట్ల మొదళ్లలో వేపపిండి వెయ్యాలనీ... కాపు తగ్గిందనీ, ఆవులకి కుడితిలో... తెలగపిండి దాణా వెయ్యాలనీ- పాలు తగ్గే యనీ సోముల్ని పిలిచి ఓ వ్యవసాయ శాస్త్రవేత్తలా చెప్తు న్నారు.

కోటేశ్వర్రావు తల్లిని తోడుగా తీసుకు తాతయ్య దగ్గరకొచ్చి, "తాతయ్యా, నాకు కలకత్తా కాలేజీలో సీటొ చ్చింది. అక్కడ చదువుకుంటాను..." అని చెప్పాడు. తాతయ్య నిరాసక్తంగా విన్నాడు. దీర్ఘంగా కోటేశ్వర్రావు వైపు చూసేడు. ఆ చూపు కోటేశ్వర్రావు యిప్పటికీ మర్చి పోలేడు. ఒక సుదీర్ఘ విషాదయాత్రకు తొలి అడుగు వేస్తున్నవాణ్ణి చూసినట్లు చూసేడు.

ఆటో ఊరి పొలిమేరల్లోకి ప్రవేశించింది. ఊరి ముందర వుండే ఆనాటి తోటల స్థానంలో దళిత, బిసి కాలనీలు ఉత్తర దక్షిణాల్లో కన్పించేయి. పడమర దోవలో యెవరిదో మోడరన్ రైస్‌మిల్లొకటి- పరాయిదేశ చక్రవర్తి స్థాపించిన విజయస్తంభంలా కన్పిస్తోంది. తూర్పు దారిలో- కాఫీ, టీ దుకాణాలు! కొత్తవీధి గుండా ఆటో బలిసిన పెనుమృగంలా నిల్చిన శంకర్రాజు ఎరువుల గొడౌంని దాటింది. వీధులు, రోజ్‌గార్ నిధుల కంకరరోడ్లతో విశాలమయినట్లున్నాయి. వీధి మలుపులో 'స్నో వైట్' కాన్వెంట్ చిలుకలను బంధించిన పంజరంలా వుంది. ఆటో ఆగిపోయింది.

"...వీధులు తుడిపిస్తే గోడలకి సున్నాలేపిస్తే జన్మ భూమికి సేవచేసినట్టేనా? అన్నింటికీ స్టూడెంట్ పిల్లలు దొరుకుతారు. దోవకడ్డంగా మానవహారం గట్టేరు చూడండి సార్..." ఫిర్యాదు జేశాడు పురుషోత్తం.

కోటేశ్వర్రావు మానవహారాన్ని చూసేడు. అంతా జన్మభూమి సేవ కోసం శపథం చేస్తున్నారు. ఆ దృశ్యాన్ని చూస్తూ ఆటో దిగిపోయేడు కోటేశ్వర్రావు. అతనికి మానవహారంగా నిల్చున్న పిల్లలు- యెప్పటివాళ్లో గొంతెత్తి అరచి, అరచీ నిల్చీ నిల్చీ నేలకు కుంచించుకు పోయిన తరతరాల గ్రామీణుల్లా కన్పించేరు. తరాల తరబడిగా వినవస్తోన్నదేదో వింటున్నట్లుగా నిల్చున్నాడు.

మానవహారం చెదిరిపోయింది. పసుపుచొక్కాల బృందమూ, తెల్లచొక్కాల యంత్రాంగమూ కదలి పోయింది. వాళ్లల్లో ఎవరో కోటేశ్వర్రావుని చూసి దగ్గరగా వచ్చి,

"యిదేనా రాటం? క్షేమమే కదా? ఉంటావా రెండ్రోజులు...?" అని పలకరించేడు.

"...యుద్ధం పూర్తయ్యేదాక వుంటానేమో..." అన్యమనస్కంగా జవాబిచ్చేడు కోటేశ్వర్రావు.

"కళింగయుద్ధం..."

ఆ వ్యక్తి ఆశ్చర్యపోయి, కోటేశ్వర్రావుని భుజం తట్టి-

"కోటీ, ఆర్ యూ ఆల్‌రైట్..." అనడిగాడు.

అప్పటికి తేరుకున్నాడు కోటేశ్వర్రావు. ఎదుటి మిత్రుణ్ణి చూస్తూ చిరునవ్వు నవ్వి-

"భుక్తా బాగున్నావా? ఎలా వుంది మీ పొలిటికల్ ఫీల్డ్...?" ప్రశ్నించేడు.

"అన్ని ఫీల్డ్సూ దండయాత్రకి గురయినాయి. నువ్వన్నట్టు యుద్ధం మధ్యనున్నాం. ఉంటావుగా, మళ్లీ కలుద్దాం..." అన్చెప్పి, వెళ్లిపోయి బృందంలో కలిసేడు.

వెళిపోతోన్న భుక్తాని చూస్తుంటే గతం కదలా డింది కోటేశ్వర్రావుకి.

"పల్లె గొప్పా? పట్నం గొప్పా?' అంశంపై వక్తృత్వ పోటీ! తను పల్లె గొప్పదనీ, భుక్తా పట్నం గొప్పదనీ...! ఇద్దరూ బలమైన పాయింట్లతో మాట్లాడేరు. జడ్జి యెవ రికి బహుమతివ్వాలో తేల్చుకోలేక... లాటరీ వేశారు.

చిత్రమేమంటే- తను పట్నంలోనూ, భుక్తా పల్లె లోనూ... స్థిరపడడం!

"...భుక్తాగారిక యిక్కడుండరట! ఫారిన్ వెళిపో తారట. కక్కిన కూడు తినడానికి ప్రయత్నాలు! దివాణం భూమికోసం ఆగేరట..." పురుషోత్తం తను యెరిగిన వార్తను చెప్తున్నాడు.

దివాణమే తప్పుడు విధానమన్నాడు భుక్తా తండ్రి.

వారసులు- దివాణం భూమి కోసం నిలిస్తే భుక్తా తండ్రి రైతుల కోసం నిలిచేడు. కౌలు చెల్లించొద్దన్నాడు. దున్నేవారిదే భూమి అన్నాడు. కొట్లాటలూ, కేసులూ...!

కోర్టులు తీర్పు తేల్చలేదు. రైతులు భూమి నొద లేదు.

వాయిదాలకు వెళ్లిన భుక్తా తండ్రి పట్నంలో మరణం...! దివాణం వారసులు చేసిన హత్య అని రైతుల ఆగ్రహం! హత్యకు ప్రతీకారంగా దివాణం వారసుడు రాజరాజేశ్వర భుక్తా హత్య! అప్పుడు కొందరు రైతుల్తో సహా... కోటేశ్వర్రావు తండ్రి అరెస్టు! అప్పటికి కోటేశ్వర్రావు కాలేజీ చదివే రోజులు!

తండ్రి రక్తంతో... భుక్తా రాజకీయ రంగంలోకొచ్చి తర్వాత్తర్వాత ఎమ్మెల్యేదాకా యెదిగేడు...!

కోటేశ్వర్రావు, యింక మరి ఆలోచించలేక పోయాడు. ఆటోలోంచి బేగూ, లగేజీ అందుకొని, నడవ బోతే, పురుషోత్తం వారించి, ఆటో యెక్కించి, మళ్లీ కదిపేడు ఆటోని!

"...దివాణం రాజరాజేశ్వర భుక్తా వారసుడెవరో ఫారిన్‌లున్నారట సార్. ఈ బాబు... అతన్తో చెయ్యి గలిపేడు. కోర్టులూ, కేసుల్తో తేలదని రాజీ బేరంకి దిగేరు. రైతులూ రాజీకి వొచ్చినట్లుగానే వుంది..." పురుషోత్తం చెప్తుంటే కోటేశ్వర్రావు ఆశ్చర్యపోయేడు.

భూమి- యెన్నెన్ని ఘర్షణలకు మూలమైంది! జీవితాలనెన్నెన్ని మలుపులు తిప్పుతోంది...! రాజీ కుదిరేక అశోకుడు- బౌద్ధం స్వీకరించేడా...? వందల, వేల జనపదుల మరణాల మీదుగా- 'బుద్ధం శరణం గచ్ఛామీ...'

ఆటో ఆగింది. పురుషోత్తం బేగూ లగేజీ దించేడు. కోటేశ్వర్రావు తాతగారింటి వైపు చూస్తూ- అడుగులు వేశాడు.

శిథిలానికి చేరువయిన పెంకుటిల్లు! వరండా అరుగులు విరిగిపడినాయి. గచ్చులు... పెచ్చులూ డింది. పై కప్పుల పెంకులు- నాచూ, పిచ్చిమొక్కలకీ ఆశ్రయమిచ్చాయి. ఆ ఇంట బాల్యాన చేసిన ఆక తాయితనం జ్ఞప్తికొస్తోంది కోటేశ్వర్రావుకి.

పెంకుటిల్లుకి యెదుటివాసలో 'దేవుడుతాత ఆశ్రమం.' దాన్ని ఆనించి రావిచెట్టు నీడలో రచ్చబండ వుండేది. దేవుడు తాత- మహాభారతం వచన కావ్యం చదువుతుంటే రచ్చబండ మీద కూర్చొని గ్రామస్థులు శ్రద్ధగా వినేవారు. పెంకుటింటి అరుగుల చీడీల మీద నుంచి చిన్నచిన్న గులకరాళ్లు అటు విసిరేవాడు కోటేశ్వ ర్రావు. రాళ్లు తగిలినవాళ్లు, 'యెవుడ్రా రాయిసిరేడు,' అని గద్దించి యిటు చూసేలోగా అరుగుల మీద బోర్లా పడుకొని దాక్కొనేవాడు కోటేశ్వర్రావు.

పెంకుటింటికి పడమరగా, వందగజాల దూరం లో కళ్లం వుండేది. కళ్లంలో పశువులశాల, దానికి అభి ముఖంగా ఒక పూరిపాక! అందులో ఒక నులకమంచం, దాని మీద వరిగడ్డి నింపిన గోనెసంచీ పరుపూ... అది తాతయ్య పడక! ఆ మంచానికి మీదుగా వాసాలకూ, పూరిపాక రాటలకూ అడ్డంగా కర్రలు వేసి నిర్మించిన 'అటక' వుండేది. దాని మీద గడ్డి పరుపు వుండేది. అదే కోటేశ్వర్రావు పాన్పు!

ఓ సంక్రాంతి సెలవురోజుల్లో తనతో పాటు పాన్పు యెక్కిన పెదమామ కొడుకు రాజశేఖర్ సిన్మా కెల్దామా అన్నాడు. ఊరికి క్రోసుడు దూరంలో టూరింగ్ టాకీస్ వుండేది. డబ్బులు లేక కళ్లంలోని ధాన్యం పురి లోంచి దొంగతనంగా ధాన్యం తీసి దుప్పట్లో మూటగట్టి కోమటి అప్పల్రాజు యింటికి వెళ్లేరు. అప్పల్రాజు చలికి యింట్లో ముసుగుతన్ని పెళ్లాం ప్రక్కలో నిద్రబోయేడు. తలుపు మీద నెమ్మదిగా కొడితే విన్పించక లేచేవాడు గాదు. గట్టిగా బాదితే కుక్కలరుస్తాయి. వీధివాళ్లు లేస్తారు. దొంగతనం బయటపడ్తుంది. ఆ చలినీ, అప్ప ల్రాజునీ, అతని పెళ్లాన్నీ కలిపి తిట్టుకునే వాళ్లిద్దరూ. తలుపు కొట్టగా, కొట్టగా లోపల మంచం కదిలిన శబ్దం, తర్వాత తలుపు దగ్గరగా వచ్చి, మెల్లగా, 'యెవుళూ?' అన్న అప్పల్రాజు భార్య ప్రశ్నా విన్పించింది.

"...మనమంటే దొంగతనం బయటపడతాదని మెల్లగ పిల్చేము. దానికేంరా? అంత మెల్లగా అడుగుతా దేంరా...?" అనేవాడు రాజశేఖర్.

మొత్తానికి ఫలానా పెద్దింటోళ్ల మనవడని చెప్ప గా- ఆమె యేమనుకునేదో, వెళ్లి అప్పల్రాజుని లేపి తను నిద్రపోయేది.

అప్పల్రాజుకి ధాన్యమిచ్చి అద్దెకు సైకిలూ, సిన్మాకి డబ్బులూ తీసుకున్నారు.

అయితే, అంత గప్‌చిప్‌గా చేసిన దొంగతనమూ బయటపడిపోయిందెలాగో! భయపడ్డంతగా తాతయ్య కోప్పడలేదు. గానీ, రాజశేఖర్ వెళిపోయేక, కోటేశ్వ ర్రావుతో,

"పెద్దోడా! పట్నపుగాలి మంచిదిగాదు. నీమీదే... మా ఆశలన్నీ సుమా..." అన్నారు తాతయ్య.

కోటేశ్వర్రావుకి ఆ మాట ఆనాడు బోధపడలేదు. ఇన్నేళ్లకు... బోధపడేసరికి...

ఇంట్లో మంచమ్మీద తాతయ్య చిక్కి, శల్యమై. కోటేశ్వర్రావు తల్లి యేదో కషాయాన్ని తాగిస్తోంది. ఆమె కోటేశ్వర్రావుని చూసి, ఆశ్చర్యపోయి-

"పెదబాబూ...? ఇదేటి, ఉత్తరమేనా లేకుండా" పలకరించింది.

కోటేశ్వర్రావు, నెమ్మదిగా మంచం దండె మీద కూర్చుని, తాతయ్య వైపు చూస్తూ పలుకరించి,

"యింత బాగులేకపోతే, నాకెందుకు తెలప లేదు...?" దుఃఖపు గొంతుతో ప్రశ్నించేడు.

తాతయ్య మనవణ్ని చూసి సంతోషం కలిగిం దేమో... మొహంలో కొద్దిగా వెలుగు నిండింది. మళ్లీ అంతలోనే, మొహంలో మార్పు కన్పించింది. మనవడి కేదో చెప్పాలని కాబోలు-

"...పెద్దోడా! పండిపోయిన ఆకు, రేకులేసిన చిగురుటాకుని కంటాది. అదీ యవసాయం! ఇపుడు యవసాయం లేదు. రైతు లేడు. రైతులూ, పశువులూ, పచ్చని పంటసేలూ, దాన్నెపురాసులూ- యెక్కడికో యెగిరిపోనాయి? ట్రాక్టర్లు, యింజిన్లు, ఎరువులు, పురుగుల మందులు, నోట్ల కట్లపాములు- వొచ్చేయి! నాగేటి చాళ్లల ఆరుద్రపురుగుని... దిగదొక్కేసేయి. నోట్ల కట్లపాములు... పొలాల నిండా! ఎలగొచ్చాయి? ఎక్కడివివి? ఎందుకివి? ఎవుళు తెచ్చారు? మీమడి గేమా యీటన్నిట్నీ...? మరెందుకొచ్చేయి... చెప్పు! చెప్పు, పెద్దోడా! ఇపుడుగాపోతే తీరిగ్గా ఆలోచించి చెప్పు..." ప్రశ్నించి, నిద్రలోకి జారిపోయేరు తాతయ్య.

ఆయన స్పృహలో వుండే ప్రశ్నించేరా...? జ్వర తీవ్రతలో ప్రేలాపనలా... తర్కించుకోసాగేడు కోటేశ్వ ర్రావు.

''...యిదిగిలాగే, పరాకు పరాకుగా మాట్లాడి నిద్రలోకి వెళిపోతాడు. మళ్లీ, మెలకువలోకొచ్చి, యిలగే మాట్లాడి, యిల్లొదిలి పొలాల వైపు వెళిపోతాడు. ఏ వైద్యుడూ నయం జెయ్యలేదు. అప్పారావు మేస్టుగారే... యిపుడు మందూ, మాకు యిస్తన్ను...'' తల్లి చెప్తుంటే కోటేశ్వర్రావు బాధగా చూస్తున్నాడు. ఆమె యిన్నాళ్లుగా పడిన మనసులోని వేదనను... కొడుక్కి విన్పించే గొంతుతో-

''సరిగ్గా, అప్పుడూ యిలాగే అయ్యేడు. నువ్వ ప్పుడు కలకత్తాలో వున్నావు. తమ్ముడు... హైస్కూల్ చదువుతో ఆగిపోయి- తాతయ్యకి సాయంగా వ్యవసా యంలోకి దిగేడు. మీ నాన్న జెయిలు నించి బెయిలు మీద వొచ్చేరు.

''ఏమనుకున్నాడో- కుటుంబాన్ని కూచోబెట్టి ఆస్తి వాటాలేస్సాడు. అన్నదమ్ముల్తోటి సమానవాటా నాకి చ్చేడు. వెండీ బంగారాలివ్వలేదు. లేవు. చినమామ ఎలక్షన్లకి ఆర్పేసాడు. భూమ్మాత్రం... అయిదేసెకరా లొచ్చింది. పెంకుటిల్లూ- రెండు భాగాలు జేస్సాడు. చిన మామకీ, నాకూ పంచేడు. కలకత్తా మామకెలాగూ యిల్లక్కర్లేదని! ఎవరి భూమి వాళ్లు, ఎవరి బతుకు వాళ్లు బతకండన్నాడు! ఎందుకో? మరియేది మనసుల బెట్టుకొని విడీసేడో విడదీసేడు తాతయ్య!

''ఎవులి బతుకాళ్లు బతకడంకి యెక్కడ కుది రింది? మళ్లా దివాణం భూమి తగువులొచ్చేయి. పంటల్ని దివాణం వోరు దాడిచేసి పట్టుకుపోబోవడం కొట్లాట. ఒక రైతు చావు...! అంతే! మీ నాన్న యిల్లొది లేశాడు. మళ్లా, పొలంలో మోటార్‌పంపు షెడ్డులో, రైతుల్తో కూచున్న మీ నాన్నని పోలీసులు కాల్చి చంపేకనే చూసేం!

''అప్పుడు... తాతయ్య నిభాయించుకోలేక పోయేడు. ఇలాగే... పరాకు, పరాకు మాటలు! ఇందుకా నిన్ను యిల్లరికం తెచ్చేను, కూతుర్ని కట్టబెట్టానా- మృత్యువునా...? అనేవారు.

''కొన్నాళ్లకి సర్దుకొని నీ తమ్ముడికి అండగా నిల బడ్డాడు. మరిపుడు సర్దుకోగలడని ఆశలేదు...'' సుదీర్ఘ గాయాన్ని తడుముకున్నట్లుగా మాట్లాడింది. కోటేశ్వ ర్రావు కిదంతా యెరిగిన విషయమేగాని, తల్లి గొంతులో ఆ విషయం అనుభవసాంద్రత అర్థమైంది...! గుండెలో సన్నగా పోటు! తనకిప్పటికీ... తీరని వేదన- కన్నతండ్రి మృతదేహాన్ని చూడలేకపోయేనని! ఎవరి చిటికెనవేలు పట్టుకు నడక నేర్చాడో, ఎవరి భుజాల మీద కూర్చొని భూమండలాన్ని దర్శించేడో, ఎవరి గుండెల మీద వర్ణ మాల నేర్చుకున్నాడో ఆ తండ్రి మృతదేహాన్ని పోలీసులు ఖననం చేసారు...!

కోటేశ్వర్రావు... భోరున యేడ్వసాగేడు.

తల్లి వారించలేదు. అయితే, ఆమె భావించి నట్లుగా తాతయ్య కోసమే యేడ్వడం లేదు... యెన్నెన్ని స్పర్శలను కోల్పోయి, చివరికి యిక్కడికి యింకెందుకో వచ్చినందుకు... యేడుస్తున్నాడు కోటేశ్వర్రావు.

కొద్దిసేపయితే నిభాయించుకుందిగానీ, తర్వాత తనూ యేడ్వసాగింది. గతాన్ని వివరాల్తో సహా రాగాలు తీస్తూ యేడ్వసాగింది.

ఏడ్పు విన్పించి, యిరుగూ పొరుగూ చేరారు. పొద్దుగుంకే వేళగావటంతో... కోటేశ్వర్రావు తమ్ముడూ, మరదలూ, పెదమామ కొడుకులూ... పొలం నుండి యిల్లు చేరేరు. పెదమామ... భాగాన్ని కొడుకులిద్దరూ పంచుకున్నారు. పెదమామా, అత్తా... పెంకుటింటి యెదుటి వాసపాలలో కాపురం! తాతయ్యను బలవం తంగా తెచ్చేరట యింటికి.

అందరి పరామర్శతో కోటేశ్వర్రావు కళ్లు తుడుచు కున్నాడు. లేచి, కాళ్లూ మొహం కడుక్కొని బట్టలు మార్చుకున్నాడు.

ఇంకా తాతయ్య నిద్రలోనే. తట్టి జూస్తే... కాలిపో తోంది దేహం జ్వరంతో. కాసేపు కూర్చొని, తర్వాత లేచి-

''అమ్మా, అలా యేరువైపు వెళ్లొస్తాను...'' చెప్పి బయల్దేరాడు.

చీకటి ముసిరేవేళ దారిలో మనుషులు... తెర మీది బొమ్మల్లా అస్పష్టంగా అగుపిస్తుంటే దారిమీద చూపు నిలిపి... వంశధార వొడ్డుకి చేరాడు... రేవు చీకటి గా వుంది. ఇసుకపర్ర మీదకు వెళ్లి... చేర్లబడ్డాడు. తల కింద తుండు మడతబెట్టేడు. రేవులో యెవరో కావడి బిందెలు ముంచిన శబ్దం. రెల్లుపూల మీదుగా యెవ రిదో రాగం. వెదురువనాల ధ్వని సంగీతం... చల్లగాలితో కోటేశ్వర్రావు అణువణువునీ పరామర్శించింది. అలా, అలా... నిదురపట్టేసింది కోటేశ్వర్రావుకి. ఆ నిదురలో... యేవేవో కలలు...

నదీతీరంలో సారవంతమయిన భూమిని సాగు జేసి, బంగారపు పంట పండించినట్లు, పంటను పశు వు మూపుల మీదా, తన భుజాల మీదా మోపులు గట్టి మోసుకు తెస్తుంటే ఊరిలోకి ప్రవేశించాక మోపులు మాయం! బరువెక్కిన భుజాలే మిగిలేవి! ఇంతకీ... భుజాలెవరివి? తనవిగానట్టుంది... తన తండ్రివో, తాతయ్యవో, వేరెవరివో... అన్పిస్తున్నాయి!

మళ్లీ కల మారిపోయేది. మహానగరం. సుందర భవంతులు, పెద్ద యంత్ర కర్మాగారం! ఆగి పోయిన యంత్రాలకు- తను... ప్రాణం బోసేట్లు... రిపేర్లు చెయ్యటం, అవి తిరగటం! తనూ... వాటితో... అలసటెరుగని యంత్రంలాగే...! యంత్రమే...! యంత్రంతో మాటాడినట్టే... యింట్లో కొడుకులూ, కూతురు, భార్యా...! వాళ్లూ యంత్రాలే...! ఔను... అదిగదిగో... ప్రవీణ్ స్పీడుగా తిరుగుతున్న యంత్రం...! కన్నా ప్రవీణ్... స్పీడుగా తిరక్కు... కళ్లు తిరిగి పడిపోతావ్. తిరగకు... ప్రవీణ్, బాబూ... కలవరించసాగేడు.

బలంగా కుదిపి, లేపాడు గణేష్. కోటేశ్వర్రావుకి మెలకువ వచ్చింది. తమ్ముడ్ని పెదమామ కొడుకుల్నీ చూసి, సంకోచిస్తూ- "... యిసుకలో అలా చేరబడేసరికి నిద్రపట్టేసింది..." మాటలు తడుము కున్నాడు.

"పదన్నయ్యా భోంచేసి పడుకుందువు..." గణేష్ లేపాడు. కోటేశ్వర్రావు యింటికొచ్చి భోంచేసి మంచ మ్మీద వాలేడేగానీ నిద్రపట్టలేదు. అటూయిటూ దొర్లి దొర్లి చివరికి మంచమ్మీంచి లేచి కళ్లం వైపు నడిచేడు. కళ్లంలో అటకమీది తన పాన్పు గుర్తొచ్చింది. కళ్లం- హై ఓల్టేజి విద్యుత్‌కాంతిలో తెల్లగా మెరుస్తోంది. కుప్పలు బోసిన పత్తిపంటను- బేళ్లు గడ్తున్నారెవరో! ఆ ప్రక్క పశు లశాలలో ట్రాక్టరొకటి నిద్రిస్తోంది. పూరిపాక కాటేజీగా మారింది. అందులో చేతులకుర్చీలో కూర్చొని యెదురుగా వున్న కలర్ టీవీలో యేదో సినిమాని చూస్తున్నాడొకాయన! అతని కుటుంబం కాబోలు- కింద చాపల మీద కూర్చొని సినిమాకు కళ్లనూ, దేహాల్ని అప్పగించేశారు. వాళ్లెవ్వరూ కోటేశ్వర్రావుకి తెలీదు. చివరికి పత్తిబేళ్లు గడుతున్న వాళ్లు కూడా! కోస్తా నుంచి వచ్చి, యిక్కడి భూములు కొనుక్కొని స్థిరపడ్డానికి వచ్చినవాళ్లు వారు! తన గ్రామంలో, తను పరదేశినన్పించింది కోటేశ్వర్రావుకి...! గిర్రున వెనుదిరిగొచ్చి, మంచమ్మీద వాలిపోయేడు.

*

పొద్దున్న లేచేక- తాతయ్య మంచం దగ్గరకు వెళ్లాడు. తాతయ్య నిద్ర లేవలేదు. చెయ్యి జూసేడు. కొద్దిగా జ్వరం తగ్గినట్లుంది. కోటేశ్వర్రావుకి తనొచ్చిన కారణం గుర్తొచ్చింది. కానీ, యెవరితో యెలా మాట్లాడడమో అర్థంగాలేదు. అప్పుడు గుర్తొచ్చేడు భుక్తా...! గబగబా కాలకృత్యాలు ముగించి భుక్తా గారింటికి వెళ్తే యెవరో, యాత్రికుల్తో భుక్తా 'శాలిహుండం' కొండకు వెళ్లేడని తెల్సింది. ఆలోచిస్తూ రోడ్డు మీదకొస్తే 'కళింగ పట్నం' అన్న క్లీనర్ కేక విన్పించింది. గభాల్న ఆ బస్సెక్కేశాడు.

ఒంటిమీది నగలన్నీ వొలిచేసాక కన్పించే అమ్మవారి విగ్రహంలా శాలిహుండం కొండ బోసిగా కన్పించింది. కొండమీదకి కంకరరాళ్ల దోవ...! శాలిధాన్యం దాచుకునే హుండీ పూర్వమిది! కొండ మీద ఎత్తయిన గజపృష్ఠాకారంలో బౌద్ధచైత్యం! ఇటుకల్తో గట్టిన మహాచైత్యాలు, స్థూపాలు... కొండ మీద నుండి చూస్తే వంశధారానది సాగర సంగమం- అనన్య సుందరంగా కన్పిస్తోంది. కోటేశ్వర్రావు... అలా చూస్తూ పురావస్తుశాఖ వారి మ్యూజియంలోకి నడిచేడు. అక్కడ... భుక్తా తన వెంటనున్న విదేశీ బౌద్ధులకి విగ్రహాలనూ, శిల్పాలనూ చూపి వివరిస్తున్నాడు. విగ్రహాలన్నీ... యేదో వొక భాగాన్ని కోల్పోయినవే! శిథిల యోధులు! శిథిల భుజాల రైతుల విగ్రహాలా...! రాత్రి యిసుకపర్రలో నిద్రించినపుడు వొచ్చిన కల గుర్తొచ్చింది. అసంకల్పితంగా భుజాలు తడుముకున్నాడు కోటేశ్వర్రావు.

విచిత్రంగా శిథిల విగ్రహాల్లో మూడు తలలూ, ఆరుచేతుల స్త్రీ విగ్రహం కన్పించింది. 'శ్వేతపత్రా అపరాజితా వైరోచని' అని దాని మీద అట్టబోర్డు కన్పించింది. అర్థంగాలేదుగానీ 'వీర వనిత' అని బోధపడింది.

"నువ్వా వచ్చేవన్నమాట! విదేశీ బౌద్ధులు వీళ్లు. లెట్ మి ఇంట్రడ్యూస్..." కోటేశ్వర్రావుని బౌద్ధులకి పరిచయం జేసాడు భుక్తా.

కొందరు విదేశీయులూ, ఒక ప్రవాసాంధ్రుడూ- యీ బౌద్ధక్షేత్రాన్ని అపురూపంగా చూస్తుంటే స్థానికులు మాత్రం వంశధార సాగరంలోకి ప్రవేశించేట్టు జీవన ప్రవాహంలో వున్నారు...!

"...నీకోసం కబురు పెడదామనుకున్నాను. యింతలో వీళ్లూ..." చెప్పాడు భుక్తా. ఆశ్చర్యపోయేడు కోటేశ్వర్రావు.

"...ఉండు వీళ్లని ఆ పబ్లిక్ రిలేషన్ అధికార్ల కప్పజెప్పి వస్తాను. నీతో ముఖ్య విషయం మాట్లాడాలి. ఊరెళ్లిపోదాం..." అని తొందరతొందరగా చెప్పి, భుక్తా బౌద్ధుల్ని తీసుకు వెళ్లాడు.

కోటేశ్వర్రావు తనూ ముఖ్య విషయమే మాట్లాడాలి! అంతలో, కొడుకు... ఫారిన్ ఛాన్సు కోసం పొలిటికల్ రికమండేషన్ రిక్వెస్టు చెయ్యటం గుర్తొచ్చింది... ఏం మాట్లాడడం... ఎలా అడగటం... ఆలోచనల్లో వున్నాడు కోటేశ్వర్రావు.

"...పద, కొండ కింద కారుంది..." భుక్తా వచ్చేడు.

కొండ దిగుతూ భుక్తా, "...మనదిక అవరోహణాక్రమం! ఔను అర్థమయిపోయింది. నేనిక రాజకీయాలొది లేస్తాను. కిందటి ఎన్నికలకే నన్ను రాజకీయాలొది లేశాయి. ఓడిపోయేను. ఈసారి టిక్కెట్టూ రాదు. వొచ్చినా మళ్లీ ఓడిపోతాను..." చెప్పుకు పోతున్నాడు.

"...పొలాలకి కరెంట్‌నీ, మోటార్ పంపుల్నీ, ట్రాక్టర్లనీ, యింజన్లనీ తెచ్చి... పంటల దిగుబడి పెంచే మనుకున్నామేగానీ అవన్నీ స్థోమతో, బ్యాంకు రుణాలు పొందే పరపతో వున్నవాళ్లకే లాభించిందని బోధపడ్లేదు. లాభించిన వాళ్లే మళ్లీమళ్లీ లబ్ధి పొందేరు. పథకాలన్నీ, ప్రణాళికలన్నీ వాళ్లకే ఉపయోగపడ్డాయి. అధిక దిగుబడి, పంటల్లోని మిగులుధనం పట్నం మిల్లులకీ, సిన్మాహాళ్లకీ, సారా వ్యాపారాలకీ పెట్టుబడైంది. అక్కడా ఆర్జనే! అదిగో... వాళ్లు పోటీ మనకి! వ్యాపారాలూ, రాజకీయాలూ అన్నీవాళ్లవే! కిందటి ఎన్నికల్లో నన్నోడించింది సారా వ్యాపార లాభమే!" భుక్తా ఓ క్షణం ఆగేడు.

ఎందుకిదంతా చెప్తున్నాడా అని ఆలోచిస్తున్నాడు కోటేశ్వర్రావు.

"...ఒక్క ముక్కలో చెప్పాలంటే రాజకీయాల్లోకి దొంగవ్యాపార పెట్టుబడొచ్చింది. అంటే లంపెన్ సెక్షన్ రాజకీయాల్లో కొచ్చేరన్నమాట!"

"...రాజకీయాలెప్పుడూ దేశాన్ని ఉద్ధరించినట్లు కన్పించలేదు నాకు..." కోటేశ్వర్రావు నిశ్చితాభిప్రాయంగా చెప్పేడు.

"నేనలా అనుకోనుగానీ, రాజకీయాలకి దూరంగా వుండదలిచేను..."

"...మంచిది! ఏభయ్యేళ్లు పైబడ్డ వయసులో మనకు కొండ దిగటం సులువుగా వుంటుంది..." నవ్వుతూ కోటేశ్వర్రావు.

అప్పటికి వాళ్లు శాలిహుండం కొండ దిగేరు.

రోడ్డు పక్కగా పార్క్ చేసిన కారులో యిద్దరూ ఊరివైపు ప్రయాణించేరు. చాలాసేపటిదాకా మౌనంగా వున్న భుక్తా యిక పదినిమిషాల్లో ఊరొస్తుందనగా-

"...మా పిల్లలు వచ్చేయమంటున్నారు. దివాణం చివరి వారసుడు రఘురామచంద్ర ఫారిన్‌లోనే వున్నాడు. అతన్తో జాయింట్‌గా యేదో బిజినెస్ చేస్తారట పిల్లలు. దివాణంభూమి కోర్టులో యెప్పటికి తేల్తుందో... ఔటాఫ్ కోర్టు రైతుల్తో రాజీ చెయ్యమంటున్నారు. నువ్వు హెల్ప్ చెయ్యాలి..."

"...నేనా?" ప్రశ్నార్థకంగా చూసేడు కోటేశ్వర్రావు.

"...అవును. కోస్తాజిల్లాల నుంచి ఓ పార్టీ వచ్చింది. ఆగ్రోఫారమ్ కోసం భూమి కొంటారట. ధర గూడా యెక్కువే యిస్తారు. రైతులకో షేర్- మాకో షేర్. నువ్వు, మీ తమ్ముడూ, బామ్మర్దుల్ని ఒప్పిస్తే చాల్ను!"

కోటేశ్వర్రావేమీ బదులివ్వలేదు. అతనికి మళ్లీ రైల్లో వచ్చిన కల గుర్తుకు వస్తోంది. అంతా విధ్వంసం... అందరూ క్షతగాత్రులు... పెను ప్రవాహమేదో తోసుకు వస్తోంది. కారుతో సహా... నెట్టివేయ బడుతున్నట్లన్పించింది! కళ్లు మూసుకు సీటుకి వాలేడు.

పెద్ద కుదుపుతో యింటి ముందు కారాగింది. కోటేశ్వర్రావుకి కారు దిగి భుక్తాకు వీడ్కోలు చెప్తుంటే-

"...తప్పక హెల్ప్ చెయ్యాలి. నీ సహాయానికి తగిన ప్రతిఫలం యేర్పాటు చేస్తాను..." చెప్పాడు భుక్తా.

కోటేశ్వర్రావు తాతయ్య మంచం దగ్గరకు వెళ్లాడు. తాతయ్య మెలకువలో లేరు. అప్పారావు మేష్టారు, యేవో మందులిచ్చినట్లుంది. మంచం చుట్టూ ఉన్న కోటేశ్వర్రావు తల్లినీ, తమ్ముడ్నీ, బావమరుదుల్నీ... అందర్నీ బయటకొచ్చేయమంటున్నారు అప్పారావు మేష్టారు.

"...కొద్దిగా గాలి తగలనివ్వండి. జ్వరం తగ్గింది. కాసేపట్లో తెలివొస్తుంది. కోటిబాబూ నువ్వెప్పుడొచ్చేవ్?" అని కోటేశ్వర్రావుని పలకరించి, వీధి వాకిలి దగ్గరకు తీసుకువెళ్లి-

"మనోవ్యధకి మందులేదు బాబూ..." అన్నారు.

తాతయ్య రోగానికి మందులేదన్నట్లుగా విన్పించింది కోటేశ్వర్రావుకి.

"ఎలాటి బతుకు బతికేడు. నేనెరుకలోకొచ్చేసరికి- యీ యిలాకాలో మీ తాతయ్యకు గొప్ప ఖ్యాతి వుండేది. అక్కడెక్కడో రణస్థలం దగ్గర ఆవులూ, గొర్రెలూ పెంచుకు బతికేవాళ్లట మీ తాతయ్య పూర్వీకులు! ఎందుకొచ్చేరో, యీ నది ఒడ్డుకొచ్చి ఉండిపోయేరు. మీ తాత తండ్రి... నది ఒడ్డు తంపర భూమిని సాగులోకి తెచ్చేడట! అదిగో, ఆ సాగుభూమి చూసేక యెక్కడెక్కడి మీ బంధువులో వొచ్చి చేరారట. ఊరయ్యింది అపుడు! ఊరిలోకి చాకలి, మంగలి, కంసాలి, మేదరి, కుమ్మరి... అన్ని వృత్తుల వాళ్లూ చేరారు. మీ తాత తరం వచ్చేసరికి సాగుభూమి పెరిగింది. గానీ, జమీందార్ల కాలంగదా! భూమి మీద కౌలన్నారట. కౌలు పెంచుతూ పోయేరట. కౌలు యివ్వలేక కొంత భూమి పోయింది. అపుడే మీ చినతాత రంగం వెళిపోయేడు. ఆ తర్వాత దొరల కాలం రావటం, మీ తాత కొడుకుల్లో ఒకడు నౌఖరీకి వెళిపోవటం, చిన్న కొడుకు ఊరి రాజకీయాల్లో మునగటం, వ్యవసాయంకి చెయ్యి సాయం కోసం మీ నాన్నని యిల్లరికం తెచ్చుకున్నాడు!

"నేల బుగ్గి నెత్తినేసుకు కష్టపడి యీ పెంకుటిల్లు గట్టేడు. మడిచెక్కలు సంపాదించేడు. ఆడవాళ్ల వొంటి మీదకి వెండీ, బంగారాలు అలంకరించేడు. నలుగురికీ మంచి జేసాడు! ఇవి నీకు తెలీని సంగతులుగావు... గానీ చెప్పాలన్పించింది.

"గానదేమి జాతకమో...? యెప్పుడూ యేటికి ఎదురీతే! అప్పుడు ఆ రోజుల్లో సహకరించాల్సిన తమ్ముడు రంగంలో కన్నుమూసేడు. సాగుభూమి కొంత జమీందారీ రద్దు చట్టంతో మరెవరికో హక్కు అయింది. కష్టపడ్డ సంపాదన ఊరి మీద కర్చు జేశాడు కొడుకు. కొత్త పంటలు మార్కెట్ జూదమాడించేయి. చేయి సాయమవ్వాల్సిన అల్లుడ్ని దివాణం భూమి మింగేసింది. అతగాడు గాబట్టి తట్టుకున్నాడు. మరొకడి వొశం గాదు. ఇంకా తట్టుకోగలుగును... ఆ భూమి వుంచగలిగితే..." క్షతగాత్రుని వీరగాథ చెప్పినట్లుగా చెప్పేరు మాష్టారు.

"యే భూమి...?" ప్రశ్నించేడు కోటేశ్వర్రావు.

"దివాణం భూమి..."

కోటేశ్వర్రావుకి గుండెల్లో చల్లగా సర్పమేదో కదిలినట్లన్పించింది. భుక్తా, తనూ, తన కొడుకూ... అందరూ భూమిని ఆస్తిగా చూస్తే- తాతయ్య ఉత్పత్తి సాధనంగా చూస్తున్నాడని అర్థమైంది.

"ఉత్పత్తి సాధనాల మీద యెవరి ఆధిపత్యముంటుందో వారిదే సమాజం మీద అధికారం..." యిటీవలి కార్మిక సమావేశంలో యెవరి ఉపన్యాసంలోనో విన్న మాట గుర్తొచ్చింది.

ఇంతలో తల్లి కేకేసింది- తాతయ్యకు స్పృహ వచ్చిందని! మాష్టారూ, కోటేశ్వర్రావూ లోనకి వెళ్లేరు. తాతయ్య మంచమ్మీదకు కోటేశ్వర్రావుని పిల్చి-

"...పెద్దోడా, వెళిపోయేవనుకున్నాను. ఎటెళ్లేవు?" ప్రశ్నించేరు. కోటేశ్వర్రావు జవాబు చెప్పక ముందే మళ్లీ,

"పెద్దోడా! జీవితమంతా సేరడు నేల మిగుల్చుకోలేదు. ఆరు అడుగుల నేల- కొనగలవా నా కోసం...? ఆ నేల మీద నేను బుగ్గవ్వాల! కొనగలవా...?" చివరి కోర్కెలా కోరేరు తాతయ్య.

కోటేశ్వర్రావుకి గుండె కవాటాల్లోంచి దుఃఖం పొంగుకొచ్చింది. కన్నీళ్లు జలజలా కారసాగేయి. నేలను అమ్ముకొని, వాటాను పట్టుకుపోవడానికి వచ్చినందుకు అపరాధభావంతో మరింతగా కుమిలి పోతూ-

"...లేదు, అమ్మటంలేదు. ఒద్దు, భూమి అమ్మిన సొమ్మొద్దు. దానికోసం వచ్చినందుకు మన్నించండి. ఇక నాకా యంత్రభూతాల మంత్రనగరమొద్దు. యిక్కడే బతుకుతాను. కొడుక్కి చెప్పేస్తాను, భూమి అమ్మనని..." లోలోపలి మాటల్ని వెళ్లగక్కేడు కోటేశ్వర్రావు.

అప్పటికి- అందరికీ అర్థమైంది కోటేశ్వర్రావు అంత అకస్మాత్తుగా వచ్చిన కారణం! తాతయ్య గ్రహించినట్లుంది. అనుమానంగా కోటేశ్వర్రావుని చూస్తూ,

"...నేలని నేను మాత్రం మోసుకెల్తానా? నాకెందుకు...? ఎందు...కూ..." అంటూ పెద్దగా యెగ ఊపిరి తీసేడు. ఒక్కసారిగా, గుండెలు గబగబా కొట్టుకొని ఆగిపోయేయి. అందరూ గుండెలు బాదుకు యేడ్వసాగేరు!

అన్యమనస్కంగా... మూడోరోజు కార్యం దాకా ఆగేడు. కార్యమయిపోయేక, యెవరికీ చెప్పకుండా, లగేజీ కూడా వదిలేసి, రైలెక్కేశాడు కోటేశ్వర్రావు. సీటుకి వాలిపోయి, కళ్లు మూసుకుంటే... కన్న తండ్రీ, తాతయ్యా, భుక్తా, తండ్రీ, సోములూ, ఉత్తమ్, భుక్తా... తన తల్లీ... తనూ, కొడుకు ప్రవీణ్... అందరూ క్షతగాత్రుల్లా కన్పించసాగేరు. యుద్ధమేదో కన్పించకుండానే క్షతగాత్రులమయ్యే మన్పించింది...!

రైలుపెట్టెలో బిచ్చగాని పాట... క్షతగాత్ర గానంలా విన్పించసాగింది కోటేశ్వర్రావుకి!

*వంశధార కథలు, 21 ఫిబ్రవరి 1999*

